RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:136 | మే 26, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



## తెలంగాణలో ఈదురుగాలులతో భారీ వర్షం

- హైదరాబాద్‌లో ఉరుములు, మెరుపులు
- పలుచోట్ల నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ధాన్యం తడవడంతో రైతుల ఆందోళన

2లో

## ప్రారంభమైన రోహిణి కార్తె

- జూన్ 7 వరకు ఎండల తీవ్రత
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వడదెబ్బ ముప్పుపై వైద్యుల సూచన



2లో




## నెల రోజులు దాటుతున్నా ఎక్కడి ధాన్యం అక్కడే

- పంట కొనుగోళ్లలో తీవ్ర జాప్యం..
- లారీలు, గన్నీలు, హమాలీలు లేక నిలిచిపోయిన ధాన్యం కాంటాలు
- రేవంత్ సర్కార్‌పై భగ్గుమంటున్న అన్నదాతలు
- మార్కెట్లు, మిల్లులు, ఐకేపీ సెంటర్ల వద్ద కిలోమీటర్ల మేర రైతుల క్యూ
- ప్రభుత్వం కొనకపోవడంతో తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముతున్న వైనం
- అకాల వర్షాలతో కల్లాలు, కేంద్రాల్లో తడిసిపోతున్న వడ్లు, మక్కలు
- నెల రోజులుగా పడిగాపులు..
- వడదెబ్బతో పది మందికి పైగా రైతుల మృతి
- 40 కేజీల బస్తాకు తరుగు పేరుతో 900 గ్రాముల అదనపు తూకం
- డబ్బులు వసూలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

2లో

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో యాసంగి ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పంట చేతికొచ్చి నెల రోజులు దాటుతున్నా ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఎక్కడ చూసినా మార్కెట్లు, రహదారుల ముందు కిలోమీటర్ల మేర ట్రాక్టర్లతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. లారీలు, గన్నీ సంచులు, హమాలీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఓ పక్క ఎండల తీవ్రతకు తట్టుకోలేక, వడదెబ్బ తగిలి కొనుగోలు కేంద్రాల వద్దే పది మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాద కరం. మరోపక్క అకాల వర్షాలకు కళ్లముందే ధాన్యం తడిసి ముద్దవుతుంటే అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు తేమ, తాలు నెపంతో తరుగు పేరిట అదనపు తూకం వేస్తూ అధికారులు, సిబ్బంది యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ యుద్ధప్రాతిపదికన స్పందించి, తడిసిన ధాన్యాన్ని సైతం ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## రైతు గోస పడుతున్నా పట్టించుకోవట్లే..

- పంటలను కొనుగోలు చేయడంలో అలసత్వం
- వారాల తరబడి కేంద్రాల వద్దే రైతులు
- పరిగి కొనుగోలు కేంద్రం సందర్శించిన తెలంగాణ బీజేపీ ప్రతినిధి బృందం
- అన్నదాతలతో ముఖాముఖి మాట్లాడిన నేతలు
- ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు



2లో

## మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్..

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కార్
- పరిస్థితి మారకపోతే కలెక్టరేట్ల ముట్టడిస్తాం
- ధాన్యం కొనుగోళ్లపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం



## ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నాం

- రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి

## హైదరాబాద్‌కు 24 గంటల తాగునీరు



- కేసీఆర్ హయాంలోనే నగర అభివృద్ధి
- కాంగ్రెస్‌కు హైదరాబాద్ ప్రజలు ఒక్క సీటూ ఇవ్వలేదు
- పార్టీ కోసం పనిచేసిన వారికి గౌరవం
- నకిలీ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి
- ఓటర్ల జాబితా సవరణలో చురుకుగా పాల్గొనాలి
- హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్**

కేటీఆర్ హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికి 24 గంటల తాగునీటి సరఫరా అందిస్తామని ప్రకటించారు. తెలంగాణకు నిరంతర విద్యుత్ అందించినట్లే నగర ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కూడా అందిస్తామని తెలిపారు. తెలంగాణకు ఇరవై నాలుగు గంటల కరెంటు ఇచ్చింది కేసీఆర్ అని, హైదరాబాద్‌కు

మిగతా 2వ పేజీలో

## మహిళలను కోటీశ్వరులను చేస్తాం



- మహిళా శక్తి సూపర్ బజార్ల ఏర్పాటు
- మహిళా సంఘాలకు రైస్ మిల్లులు, గోదాములు
- ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి బజార్లు
- మహిళా సంఘాలకు 30 ఏళ్ల లీజుపై భూములు
- జీరో వడ్డీ రుణాలు అందిస్తాం
- మహిళా సంఘాల రుణ పరిమితి రూ.10 లక్షలకు పెంపు: సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

మంగళవారం | మే 26, 2026

# తెలంగాణలో భారీ వర్షం

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాజధాని నగరంలోని వనస్థలిపురం, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను అప్రమత్తం చేసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జనగామ జిల్లా నర్మెట్ట మండలంలో భారీ ఈదురుగాలుల కారణంగా పలు ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగి రహదారులపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూడా కూలిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ఘట్‌కేసర్ ప్రాంతంలో వడగళ్ల వర్షం కురవడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. మెదక్, సూర్యాపేట జిల్లాల్లో కూడా వర్షం కురవడంతో తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. గత కొన్ని రోజులుగా మండిపోతున్న ఎండల మధ్య వర్షం కురవడంతో ఉష్ణోగ్రతలు కొంత తగ్గాయి. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదలడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకల్లో సమస్యలు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా మార్కెట్ యార్డులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం నష్టపోతుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పంటలను రక్షించుకునేందుకు రైతులు హడావుడిగా కప్పే ప్రయత్నాలు చేశారు. వాతావరణ శాఖ రాబోయే రోజుల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించింది. ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు తెలిపారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. ఈ సందర్భంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో 119 నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి మహిళా సంఘాలకు 30 ఏళ్ల లీజుపై నామమాత్రపు అద్దెకు ఇవ్వాలని సూచించారు. మహిళా సంఘాలకు ప్రత్యేక నిధులు, జీరో వడ్డీ రుణాలు అందిస్తామని తెలిపారు. ప్రతి మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు, లాజిస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ధాన్యం నిల్వ, రవాణా వ్యవస్థల్లో మహిళల పాత్ర పెంచాలని సూచించారు. మహిళా సంఘాల రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికే మహిళా సంఘాల రుణాలపై ప్రభుత్వం రూ.1,390 కోట్ల వడ్డీ సబ్సిడీ చెల్లించినట్లు తెలిపారు. మహిళలకు వెయ్యి బస్సులు కేటాయించి నెలకు రూ.70 వేల వరకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, జూన్ 5న మరో 553 బస్సులు మహిళా సంఘాలకు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు 24 గంటల తాగునీరు

**మొదటి పేజీ తరువాయి**

24 గంటల తాగునీరు కూడా కేసీఆరే అందిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీ లేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలన గురించి నగర ప్రజలకు పూర్తిగా అవగాహన ఉందని, అందుకే నగరంలో ఒక్క స్థానం కూడా ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఫ్లైఓవర్లు, ఆసుపత్రులు, ఇతర భవనాలకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రిబ్బన్లు కట్ చేస్తూ ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి పెట్టామని కేటీఆర్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన గౌరవం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీని బలోపేతం చేయడంలో కృషి చేసిన వారిని గుర్తించి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై కూడా పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ అవగాహన కల్పించారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసినట్లు ఆరోపిస్తున్న నకిలీ, డూప్లికేట్ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ ఒక్కరి ఓటు కూడా కోల్పోకుండా పార్టీ శ్రేణులు జాగ్రత్తగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని, ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించాలని కేటీఆర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని తెలిపారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి పనిచేస్తుందని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, మౌలిక వసతులు, నగరాభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ప్రారంభమైన రోహిణి కార్తె

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలుగు పంచాంగం ప్రకారం అత్యంత శక్తిమంతమైన రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. జూన్ ఏడు వరకు కొనసాగనున్న ఈ కాలంలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ రోజుల కంటే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే మండుతున్న ఎండలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతుండగా, రోహిణి కార్తె ప్రభావంతో వడగాలులు, ఉక్కపోత మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని చెబుతున్నారు. రోహిణి కార్తె కాలాన్ని సంప్రదాయంగా అత్యంత వేడిగా ఉండే దశగా భావిస్తారు. ఈ సమయంలో భూమి ఉపరితలం తీవ్రంగా వేడెక్కడం వల్ల గాలి ఉష్ణోగ్రతలు కూడా అమాంతం పెరుగుతాయి. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారిపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచే మండే ఎండలు, మధ్యాహ్నం వడగాలులు, రాత్రిపూట ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

# అయ్యో.. రైతన్న..!

- నెల రోజులు దాటుతున్నా ఎక్కడి ధాన్యం అక్కడే
- పంట కొనుగోళ్లలో జాప్యం..
- లారీలు, గన్నీలు, హమాలీలు లేక నిలిచిపోయిన ధాన్యం కాంటాలు
- రేవంత్ సర్కార్‌పై భగ్గుమంటున్న అన్నదాతలు
- మార్కెట్లు, మిల్లులు, ఐకేపీ సెంటర్ల వద్ద కిలోమీటర్ల మేర రైతుల క్యూ
- ప్రభుత్వం కొనకపోవడంతో తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముతున్న వైనం
- అకాల వర్షాలతో కల్లాలు, కేంద్రాల్లో తడిసిపోతున్న వడ్లు, మక్కలు
- నెల రోజులుగా పడిగాపులు..
- వడదెబ్బతో పది మందికి పైగా రైతుల మృతి
- 40 కేజీల బస్తాకు 900 గ్రాముల అదనపు తూకం
- డబ్బులు వసూలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

నెల రోజుల నుండి పంటల కొనుగోలు కోసం రాష్ట్రంలోని మార్కెట్లు, రహదారులు, మిల్లులు, గోదాముల ముందు రైతన్నలు పడిగాపులు పడుతున్నారు. ధాన్యం సేకరణలో పూర్తిగా వైఫల్యం చెందడంతో, ఎక్కడ చూసినా కిలోమీటర్ల మేర ట్రాక్టర్లతో అన్నదాతలు రోడ్లపైనే వేచి ఉండాల్సిన దైన్య పరిస్థితి ఏర్పడింది. లారీలు, గన్నీ సంచులు, హమాలీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లు, మక్కలను అమ్ముకోవడానికి ఇటు ప్రకృతితో, అటు ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ప్రతిరోజూ నరకప్రాయమైన పోరాటం చేయాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిపై రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం భగ్గుమంటోంది. యాసంగి పంటలు చేతికొచ్చి నెల రోజులు దాటుతున్నా, ప్రభుత్వం మాత్రం కొనుగోళ్లు చేపట్టకుండా కాలయాపన చేస్తూ తప్పించుకుంటోందని అన్నదాతలు ఆగ్రహజ్వాలలు కురిపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ బతుకులు మారుతాయని ఆశించి, ఓటు వేసి ఘోరంగా నష్టపోయామంటూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నాడు విత్తనాలు, యూరియా కోసం మొదలైన క్యూలైన్ల తిప్పలు.. నేడు పండించిన పంటను అమ్ముకునే వరకు నిరంతరాయంగా సాగుతూనే ఉన్నాయని, ఈ ప్రభుత్వం రైతులకు ఏమాత్రం అనుకూలంగా లేదని క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**లారీలు లేవు.. గన్నీలు లేవు..**

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్లు, రైస్ మిల్లులు, ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఎక్కడ చూసినా కిలోమీటర్ల మేర ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీసం గన్నీ బ్యాగులు అందుబాటులో లేవు, లోడింగ్ చేయడానికి హమాలీలు రారు, పంటను మిల్లులకు తరలించడానికి లారీలు రావడం లేదు. దీంతో కాంటాలు పూర్తిగా నిలిచిపోయి కొనుగోళ్లలో



తీవ్ర జాప్యం జరుగుతోంది. నెల రోజులుగా మార్కెట్లు, రహదారులు, గోదాముల ముందు అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. ఈ క్రమంలోనే ఎండల తీవ్రతను తట్టుకోలేక, వడదెబ్బ తగిలి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 10 మందికి పైగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే ప్రాణాలు కోల్పోవడం అత్యంత కలిచివేసే అంశం.

**కళ్లముందే కొట్టుకుపోతున్న శ్రమ!**

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఓపెన్ మార్కెట్‌లోనే ఉంచిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటలు వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. గత 20 రోజులుగా మొక్కజొన్న పంట తడుస్తూ, ఎండుతున్నా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల ధాటికి మార్కెట్లలో గుట్టలుగా పోసిన ధాన్యం, ఇతర పంటలు కొట్టుకుపోయిన దైన్య పరిస్థితులు కనిపిస్తున్నాయి. అటు ప్రకృతి కన్నెర్ర చేసినా, ఇటు ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కూడా ఇంతటి నరకం చూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో యథేచ్ఛగా అవినీతి!**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అవినీతి పతాక స్థాయికి చేరిందని, అధికారులు, సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం 40 కేజీల బస్తాకు సంచి తూకం పోగా.. తేమ, తాలు నెపంతో ఏకంగా 900 గ్రాముల చొప్పున అదనంగా తూకం వేస్తూ తరుగు పేరిట దగా చేస్తున్నారు. దీనికి తోడు ప్రతి చిన్న పనికీ, కాంటా వేయడానికీ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెప్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ కేంద్రాల్లో రోజులు గడుస్తున్నా కాంటా కాకపోవడం, అవినీతి వేధింపులు తట్టుకోలేక.. చివరకు రైతులు తక్కువ ధరలకే స్థానిక మిల్లర్లకు, దళారులకు తమ పంటను అమ్ముకుని నిలువునా నష్టపోతున్నారు.

**కొనుగోలు కేంద్రాల వద్దే ప్రాణాలు కోల్పోయారు**

ఈ సుదీర్ఘ నిరీక్షణల వేళ ఎండ తాకిడికి, తీవ్రమైన వడదెబ్బతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 10 మందికి పైగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే ప్రాణాలు కోల్పోయారు. కల్లాల వద్దే రాత్రింబవళ్లు కావలి ఉంటూ, కనీస నీడ, తాగునీటి సదుపాయాలు కూడా లేక ఎండ తీవ్రతకు అన్నదాతలు అక్కడికక్కడే కుప్పకూలిపోతున్నారు. పండించిన పంటను అమ్ముకునే క్రమంలో ఇలా రైతులు ప్రాణాలు కోల్పోతుండటం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతాంగంలో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని స్పష్టం చేస్తోంది.

**రైతాంగం ఆక్రందన!**

మహాత్మా గాంధీ కన్న కలలు, ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు అన్నదాతలను నడిరోడ్డుపై నిలబెట్టిందని రైతులు మండిపడుతున్నారు. ఎంతో నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పెద్ద తప్పు చేశామని, ఇప్పుడు పంటలు అమ్ముకోలేక అప్పులపాలవుతున్నామని ఆక్రోశిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయకుండా తప్పించుకుంటే, తాము ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ నిద్రమత్తు వీడి, తక్షణమే యుద్ధ ప్రాతిపదికన గన్నీ సంచులు, లారీలను సమకూర్చి, తడిసిన ధాన్యాన్ని సైతం ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతు గోస పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లే..

**వేద న్యూస్, పరిగి**

'రైతు గోస – బీజేపీ భరోసా' బకార్యక్రమంలో భాగంగా తెలంగాణ బీజేపీ ప్రతినిధి బృందం సోమవారం పరిగి వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు నేతృత్వంలో జరిగిన ఈ పర్యటనలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనసాగుతున్న పరిస్థితులను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు వారాల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో అవ్యవస్థ నెలకొందని పేర్కొన్నారు. ధాన్యం సకాలంలో సేకరించకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బీజేపీ ప్రతినిధి బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. ధాన్యం తూకం, నిల్వ,



రవాణా, చెల్లింపుల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుంది. పంట అమ్మకానికి వచ్చిన రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద ఉండాల్సి వస్తోందని రైతులు వాపోయినట్లు సమాచారం. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బీజేపీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని నాయకులు హెచ్చరించారు. రైతులకు గిట్టుబాటు ధర, సకాలంలో కొనుగోళ్లు, త్వరిత చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. రైతులకు అండగా నిలవడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు.

# ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నాం

- రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్**

రేవంత్ రెడ్డి రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై సీపీఎం నాయకులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రైతులు, కార్మికులు, విద్య, మూసీ పునరుజ్జీవం వంటి అంశాలపై చర్చ జరిగింది. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కేవలం మద్దతు ధరలు ప్రకటిస్తోందని, కానీ రాష్ట్రంలో పంట కొనుగోలు చేయడం లేదని ముఖ్యమంత్రి విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్నవడ్లకు ఐదు వందల రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు సేకరిస్తున్నామని సీఎం వెల్లడించారు. రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై కూడా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ నిర్వాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్..

## ధాన్యం కొనుగోళ్లపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

**వేద న్యూస్, సిద్దిపేట**

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. యూరియా, సాగునీరు, విద్యుత్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో ఎన్నడూ రైతులు ఇంత దుర్భర పరిస్థితి ఎదుర్కోలేదని పేర్కొన్నారు. 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామనడం ఎంతవరకు సబబు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం మోపకుండా, కేంద్రంతో మాట్లాడి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే 70 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని ప్రశ్నించారు. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. రోహిణి కార్తె వచ్చినా ఇంకా కల్లాల్లోనే ధాన్యం ఉండటం దురదృష్టకరమన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని తెలిపారు. రైతులు ధాన్యం కుప్పల వద్దే ప్రాణాలు కోల్పోతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు మృతి చెందారని పేర్కొన్నారు. మిషన్ మోడ్‌లో వడ్లు కొంటామని చెబుతున్నారు.. అది మిషన్ మోడ్ కాదు, కమిషన్ మోడ్ అంటూ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుబంధు నిధులు కూడా పూర్తిగా విడుదల చేయలేదని ఆరోపించారు. ఒకటి, రెండు రోజుల్లో పరిస్థితి మారకపోతే తానే స్వయంగా కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతానని, వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వేద న్యూస్

మంగళవారం మే 26 , 2026

# సింగపూర్ విద్యా సంస్థతో

- తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు
- టెమాసెక్ పాలిటెక్నిక్‌ను సందర్శించిన ఈవీ శ్రీనివాస్ రావు
- ఇంటర్న్‌షిప్‌లు, ఉన్నత విద్యపై చర్చలు




**వేద న్యూస్, హనుమకొండ:**

సింగపూర్‌లోని ప్రముఖ ప్రభుత్వ విద్యాసంస్థ టెమాసెక్ పాలిటెక్నిక్‌ను వరంగల్ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులతో సమావేశమై తెలంగాణ డిప్లొమా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మెదక్ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థిని ఎం. కిరణ్మయి, సింగపూర్‌లో స్థిరపడిన పరకాల వాసి స్వర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్య, పరిశ్రమల అనుభవం కల్పించే అంశాలపై కళాశాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ అంశాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తెలంగాణ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని ఈ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు.

# పెద్దమ్మ తల్లి ఆలయానికి రూ.11 వేల విరాళం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయానికి రుద్రూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొత్తపల్లి రవికిరణ్ రూ.11 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణ పనుల కోసం ఆయన ఆలయ కమిటీ నిర్వాహకులకు విరాళం చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కొత్తపల్లి రవికిరణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గంగాధరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసిన సందర్భంగా సోమవారం మధురానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చొప్పదండి నియోజకవర్గాన్ని విద్యా రంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గంగాధరతో పాటు పరిసర ప్రాంతాల పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి కళాశాలను మంజూరు చేయడం సంతోషకరమన్నారు. చొప్పదండిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రామడుగులో అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

# ఐకేపీ వీవోఏల నిరవధిక సమ్మె

- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్



**వేద న్యూస్, రుద్రూర్:**

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రుద్రూర్ మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు జరీనా బేగం మాట్లాడుతూ.. వీవోఏలకు కనీస వేతనంగా రూ.26 వేల రూపాయలు చెల్లించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే 58 జీవోను సవరించి, సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని రూ.20 లక్షల వరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు జిజియా భాయ్, కార్యదర్శి జి. స్వరూప, సహాయ కార్యదర్శి నాగరాణి, కోశాధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి



- జగిత్యాలలో కాంగ్రెస్ భారీ ర్యాలీ
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- బీజేపీపై బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదు?
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**వేద న్యూస్, జగిత్యాల:**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెట్రో ధరల పెంపునకు వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెట్రో ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనలో ధరల తగ్గింపుపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే ఇంధన ధరలు పెంచారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ కూడా బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై మాట్లాడటం లేదని మంత్రి దుయ్యబట్టారు. కేటీఆర్, హరీష్ రావు బీజేపీపై ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరాములపల్లెలో వైభవంగా చౌడాలమ్మ జాతర

- భారీగా తరలివచ్చిన భక్తులు, ప్రజాప్రతినిధులు



**వేద న్యూస్, గొల్లపల్లి:**

గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామంలో శ్రీ దేవి చౌడాలమ్మ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. జాతర మహోత్సవంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యాదవ కుల బంధువులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి మాట్లాడుతూ మండల ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సబ్బండ వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలి

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

**వేద న్యూస్, వరంగల్:**

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 78 విభాగాల్లో సేవలందిస్తున్నప్పటికీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, సంవత్సరానికి 35 క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబాలకు హెల్త్ కార్డులు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, పీఎఫ్ సకాలంలో చెల్లించి ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ భేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



# వడదెబ్బకు ప్రదీప్ అనే యువకుడు మృతి..!

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఖిలా వరంగల్ మండలం 43 వ డివిజన్ మామునూరు గ్రామం జాన్సీ నగర్ కు చెందిన కొంగ ప్రదీప్ అనే యువకుడు 35 సంవత్సరాలు వడదెబ్బ కారణంగా మృతి చెందాడు. వృత్తిరీత్యా మెడికల్ రిప్రజెంటేటివ్ గా పని చేస్తుండేవారు. ఇటీవల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో యువకులు సైతం ఎండ తాపానికి మృత్యువాత పడుతున్నారు. వడదెబ్బకు గురైన ప్రదీపును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న సందర్భంగా మరణించాడు మృతుడు అవివాహితుడు కాగా ఎదిగిన కొడుకు వడదెబ్బ కారణంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రదీప్ సామాజిక కార్యక్రమాలలో చిరుకుగా పాల్గొనేవారు. వడదెబ్బ కారణంగా మరణించిన కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరారు.



వేద న్యూస్

మంగళవారం మే 26 , 2026

# విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

**- అల్మారాకు విద్యుత్ సరఫరా కావడంతో విషాదం**



**వేద న్యూస్, పాపన్నపేట:**

విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ముద్దపూర్ గ్రామానికి చెందిన పోలీసు పార్వతి (35) తన కూతురు కార్యక్రమం కోసం అల్మారాలోని బట్టలు తీసుకునేందుకు వెళ్లింది. అల్మారా పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలను ఎలుకలు కొరకడంతో విద్యుత్ సరఫరా అల్మారాకు చేరినట్లు తెలుస్తోంది. అల్మారాను తాకగానే పార్వతి విద్యుత్ షాక్‌కు గురై కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి ఆమెను మెదక్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు




**- పదో తరగతి టాపర్లకు సన్మానం**

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలు, కేజీబీవీ, ఉర్దూ మీడియం పాఠశాలల నుంచి మొదటి, రెండో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ. 2500, రూ. 1500 నగదు బహుమతులతో పాటు కాలేజీ బ్యాగులు, లంచ్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, రైడ్స్ అధ్యక్షులు కర్రోళ్ల కృష్ణ ప్రసాద్, వంశీ హైస్కూల్ డైరెక్టర్ కిలారు పద్మజ విజయ్ కుమార్, రైడ్స్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాయిదా పడ్డ బీడీ కార్మిక చర్చలు

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**




బీడీ కార్మికుల వేతనాలపై సోమవారం జరిగిన చర్చలు సగం సఫలం, సగం విఫలమైనట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. వేయి బీడీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 230కు అదనంగా రూ. 20 పెంచి మొత్తం రూ. 250 చెల్లించేందుకు యజమానులు అంగీకరించినట్లు వెల్లడించారు. పీఎఫ్ అమలులో ఉన్న కార్మికులకు అదనంగా రూ. 5 చెల్లించాలని, పీఎఫ్ అమలు కాని కార్మికులకు రూ. 25 అదనంగా ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రాట్యుటీని చట్ట ప్రకారం అమలు చేయాలని కూడా సంఘాలు కోరాయి. ఈ అంశాలపై ఈ నెల 28 తర్వాత మళ్లీ చర్చలు కొనసాగించాలని యజమానులు, కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. యజమానులు చర్చలకు సిద్ధపడకపోతే కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ చర్చల్లో బీడీ యజమానులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సుంకర నరేష్ సేవా స్ఫూర్తికి అంతర్జాతీయ గుర్తింపు





**వేద న్యూస్, కాప్రా :**

హైకోర్టు న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త, సామాజిక సేవకుడు, కాప్రాకు చెందిన సుంకర నరేష్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డు లభించింది. సమాజ సేవలో విశిష్ట కృషి చేస్తున్న ఆయనకు లండన్ పార్లమెంట్ వెస్ట్‌మినిస్టర్ గుర్తింపు పొందిన "బీ ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ" ఆధ్వర్యంలో ఈ గౌరవం అందజేశారు. సంస్థ స్థాపకుడు రామ్ కళ్యాణ్ చల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏ డికేడ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్" కార్యక్రమం ద్వారా పదేళ్ల సామాజిక సేవా ప్రయాణాన్ని, అంతర్జాతీయ మానవతా సహకారాన్ని ఘనంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి లండన్ పార్లమెంట్ సభ్యుడు జిమ్ డిక్సన్, లార్డ్ ఉదయకుమార్ నాగరాజు మద్దతు తెలిపారు. ఆదివారం మాదాపూర్ మహీంద్రా క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సుంకర నరేష్ ఈ అవార్డును స్వీకరించారు. సమాజంలో తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు, మాజీ సైనికులు, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు, మూగజీవుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్న నరేష్‌కు ఈ గౌరవం దక్కడం విశేషంగా నిలిచింది. అంతే కాకుండా నేటి యువత సరైన దిశలో ముందుకు సాగేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్న ఆయన సేవలను నిర్వాహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా సుంకర నరేష్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందిస్తున్న సంస్థ నుంచి ఈ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించేందుకు ఈ గుర్తింపు కొత్త ఉత్సాహాన్ని, బాధ్యతను కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీనుబాబు, అరుణోదయ కళాకారిణి విమలక్క, సంస్థ సభ్యులు సుహాసిని, దేవ్, స్వప్న, దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తు తెలియని మృతదేహం

**వేద న్యూస్, పాపన్నపేట:**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 25 సంవత్సరాల వయస్సు గల యువకుడు ఫ్రెంచ్‌కట్ గడ్డంతో, రెండు జతల బట్టలున్న బ్యాగుతో ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనం కోసం వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం చెక్‌డ్యాం వద్ద స్నానం చేయడానికి నీటిలోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగిపోయినట్లు సమాచారం. చెక్‌డ్యాం ఒడ్డున బట్టలు, బ్యాగు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీనివాస్ గౌడ్ గజఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వివరాలు తెలియరాకపోవడంతో పోలీసులు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ జార్జ్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# ఆగస్టు 15లోపు పనులు పూర్తి చేయాలి

- వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు
- డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణకు రైతులు సహకరించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న టన్నెల్ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ.. ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వర్షాకాలానికే యాతాలకుంట టన్నెల్ ద్వారా గోదావరి జలాలు బేతుపల్లి చెరువుకు చేరాలని తన ఆకాంక్ష అని తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రాజెక్ట్ కోసం భూములు ఇచ్చే రైతులకు సరైన పరిహారం అందిస్తున్నామని తెలిపారు. గోదావరి జలాలు అందితే ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా పెరిగి రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు

**- ప్రజలకు అందుబాటులో అన్ని రకాల ఆధార్ సవరణలు**



**వేద న్యూస్, మహబూబాబాద్:**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, పింఛన్లు, పాస్‌పోర్టు, పాన్‌కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్య సేవలు తదితర అవసరాలకు ఆధార్ కీలక గుర్తింపు పత్రంగా మారిందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల చిన్నారులకు బయోమెట్రిక్ అప్‌గ్రేడ్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్‌కు సంబంధించిన పలు సేవలు అందుబాటులో ఉన్నాయని హెడ్ పోస్టుమాస్టర్ అనిల్ తెలిపారు. భారత ప్రత్యేక గుర్తింపు ప్రాధికార సంస్థ మార్గదర్శకాల ప్రకారం కార్యాలయ పనిదినాల్లో ఆధార్ సేవలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఆధార్ నమోదు, చిన్నారుల ఆధార్ నమోదు, పేరు, చిరునామా, జనన తేదీ, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ సవరణలు, లింగ మార్పు, ఫోటో మార్పు, బయోమెట్రిక్ అప్‌గ్రేడ్ వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ప్రత్యేక ఆధార్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. యూఐడీఏఐ నిబంధనల ప్రకారం నిర్ణయించిన రుసుములు మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు.

# అల్మాస్‌పూర్‌లో కూలిన భారీ వృక్షం

**- కారుపై పడడంతో ధ్వంసం.. తప్పిన ప్రమాదం**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో సోమవారం ఉదయం భారీ వృక్షం ఒక్కసారిగా కూలి రహదారి పక్కన నిలిపి ఉంచిన కారుపై పడింది. ఈ ఘటనలో కారు వెనుక భాగం పూర్తిగా ధ్వంసమై తీవ్ర నష్టం వాటిల్లింది. ఘటన సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో చెట్టు బలహీనపడినట్లు తెలుస్తోంది. ఉదయం ఒక్కసారిగా చెట్టు విరిగి పడటంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న గ్రామ యువకులు, స్థానికులు కలిసి చెట్టు కొమ్మలను తొలగించి రహదారిని శుభ్రం చేశారు. చెట్టు కూలిపోవడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, అనంతరం పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది. గ్రామంలో ఎండిపోయిన, ప్రమాదకరంగా మారిన పాత వృక్షాలను వెంటనే తొలగించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

వేద న్యూస్
మంగళవారం మే 26 , 2026

# వృద్ధుడికి ఎన్ఆర్ఐ ఆర్థిక చేయూత



## – మానవత్వం చాటిన తోట సత్యం

**వేద న్యూస్, రామడుగు:**

మండల కేంద్రానికి చెందిన జిట్టవెని మల్లయ్య అనే వృద్ధుడు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. తలకు గాయం కావడంతో మెదడులో రక్తనాళాలు గడ్డకట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన అమెరికాలో స్థిరపడ్డ ఎన్ఆర్ఐ తోట సత్యం బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. సముద్రాల శ్రీనివాస్, కర్నె శ్రీను, జట్టిపల్లి అశోక్, చంద అనిల్‌లు ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకున్న తోట సత్యంను గ్రామస్తులు అభినందించారు.

# 50 శాతం సబ్సిడీతో జీలుగా విత్తనాల పంపిణీ

## – రైతులు సద్వినియోగం చేసుకోవాలి: అధికారులు



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలంలోని ప్యాక్స్ చొప్పదండి, ఆర్నకొండ కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై జీలుగా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి మమత పాల్గొని రైతులకు విత్తనాల వినియోగంపై సూచనలు చేశారు. రైతులు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని దిగుబడులు పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సీఈఓ తిరుపతిరెడ్డి, కుమారస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారులు సంపత్, రమ్య జోత్స, రైతులు, సేల్ కౌంటర్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం

## – గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలంలోని భూపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక సీమంతం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించి పండ్లు, గుడ్లు, పోషకాహార పదార్థాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడిపెల్లి



సంజీవ్ కుమార్, సర్కిల్ సూపర్వైజర్లు సుధారాణి, మస్రత్, అంగన్‌వాడీ టీచర్లు జమున, కమల, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్థానిక మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# డంప్‌యార్డ్ పొగతో ప్రజలకు అనారోగ్యం



## – సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు తప్పవు
## – రాజకీయ పక్షాల జేఏసీ హెచ్చరిక

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్‌లోని డంప్‌యార్డ్ వల్ల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజల ప్రాణాలను కాపాడాలని రాజకీయ పక్షాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ, సిపిఎం, టీఆర్ఎస్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డంప్‌యార్డ్ నుంచి వస్తున్న పొగ కారణంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఈ సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. గత ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా డంప్‌యార్డ్ సమస్యను పరిశీలిస్తామని చెప్పి కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేంద్ర మంత్రులను కూడా డంప్‌యార్డ్ వద్దకు తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు లేదని పేర్కొన్నారు. డంప్‌యార్డ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన అధికారులు ఆరు నెలల్లో డంప్‌యార్డును నగరం నుంచి తరలిస్తామని, విలీన గ్రామాల చెత్తను ఆయా గ్రామాల్లోనే డంప్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను తగులబెట్టొద్దు

## – అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలి – రైతులకు ఎస్సై నరేష్ రెడ్డి విజ్ఞప్తి

**వేద న్యూస్, చొప్పదండి:**

వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలిన గడ్డి, పంట అవశేషాలను తగులబెట్టవద్దని చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి రైతులను కోరారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో పంట అవశేషాలకు నిప్పంటించడం వల్ల అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎండ తీవ్రత, గాలుల ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపించి పంట పొలాలు, విద్యుత్ తీగలు, చెట్లు, ఇళ్లు మరియు ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమి సారవంతత కూడా తగ్గిపోతుందని పేర్కొన్నారు. రైతులు పంట అవశేషాలను పశువుల మేతగా లేదా సేంద్రీయ ఎరువుగా వినియోగించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, రహదారుల సమీపంలో మంటలు వేయరాదని, ఎండ మరియు గాలి ఎక్కువగా ఉన్న సమయంలో అగ్ని పెట్టడం పూర్తిగా నివారించాలని కోరారు. చిన్న మంట కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చని గుర్తుంచుకోవాలని, ఎక్కడైనా మంటలు కనిపిస్తే వెంటనే అగ్నిమాపక శాఖ లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు.




# పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలి

## – జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీక్ష
## – భూముల మార్కెట్ విలువల సవరణపై సమావేశం

**వేద న్యూస్, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణపై సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొని మార్కెట్ విలువల పునర్విమర్శపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.41 ప్రకారం భూ మార్కెట్ విలువల సవరణకు సంబంధించిన మార్గదర్శకాలను సమావేశంలో పరిశీలించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వర్గీకరణ, వ్యవసాయ మరియు వ్యవసాయేతర భూముల విలువల నిర్ణయం, ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న ఆస్తుల ప్రత్యేక విలువల నిర్ణయం వంటి అంశాలపై చర్చించారు. పట్టణ ప్రాంతాలు,



గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ విలువల నిర్ణయానికి సంబంధించి కమిటీల బాధ్యతలు, విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని సబ్-రిజిస్ట్రార్ పరిధుల్లో భూముల ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అనుకూలంగా, పారదర్శకంగా మార్కెట్ విలువల సవరణ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# జూదం ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

**వేద న్యూస్, పాపన్నపేట:**

## – రూ.3,490 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం

పాపన్నపేట మండలం అన్నారం గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామ సమీపంలో పలువురు జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,490 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా జూదం నిర్వహించినా, ఆడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మహిళా భవన్ నిర్మాణానికి భూమిపూజ

**వేద న్యూస్, ములుగు:**



మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జకారం గ్రామంలో మహిళా భవన్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని వీఓఏ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, మహిళల శక్తి పెంపకం, సామూహిక కార్యక్రమాల నిర్వహణకు ఈ మహిళా భవన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి సమత, ఉప సర్పంచ్ బొట్ల కార్తీక్, వార్డ్ సభ్యులు, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, మాజీ సర్పంచ్ దాసరి రమేశ్, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

**వేద న్యూస్ హైదరాబాద్ :**



హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శామీర్‌పేట్ సమీపంలో రోడ్డుపై నిలిచిఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఢీకొట్టిన ప్రభావం తీవ్రంగా ఉండటంతో డీసీఎంలో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న శామీర్‌పేట్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీసీఎం వాహనంలో ఇరుక్కుపోయిన గాయపడిన వ్యక్తిని స్థానికుల సహాయంతో బయటకు తీసి సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వేద న్యూస్

మంగళవారం మే 26 , 2026

# మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభం



- పాదాచారులకు చల్లని మజ్జిగ పంపిణీ
- సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్
- వేసవిలో ఆరోగ్యంపై జాగ్రత్తలు

**వేద న్యూస్ హైదరాబాద్ :**

వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాదాచారులకు ఉపశమనం కల్పించే ఉద్దేశంతో సుభాష్ నగర్ జీడిమెట్ల బస్ డిపో వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకుడు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. పాదాచారులకు మజ్జిగ అందించడం మాధవ సేవతో సమానమని అన్నారు. ఎండల తీవ్రత నుంచి ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మజ్జిగ శరీరాన్ని చల్లబరచడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎండల్లో బయటకు వెళ్లే వారు తరచూ మజ్జిగ, నీరు, కొబ్బరి నీళ్లు వంటి పానీయాలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జీడిమెట్ల బస్ డిపో వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, కార్మికులు, పాదాచారులకు పెద్ద ఎత్తున మజ్జిగ పంపిణీ చేశారు. మండుటెండలో చల్లని మజ్జిగ అందించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. వేసవి కాలంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు. సమాజ సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలకు స్థానిక నాయకులు ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీనారాయణ, కట్ట సుందర్ బాబు, కట్ట సుకుమార్, ప్రేమ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# ప్రజావాణిలో ప్రజల అర్జీల స్వీకరణ

**వేద న్యూస్ ఆదిలాబాద్ :**



జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. భూ వివాదాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, తాగునీరు, ఉపాధి, రహదారులు, విద్యుత్, రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రతి అర్జీని జాగ్రత్తగా పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు వేగంగా స్పందించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతున్నాయని అధికారులు తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అందిన ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటకు శ్రీకారం


**వేద న్యూస్ నారాయణపేట :**



జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో బడిబాట కార్యక్రమ అమలు, నమోదు లక్ష్యాలు, గ్రామస్థాయి ప్రచార కార్యక్రమాలు, పాఠశాలల సిద్ధతపై విస్తృతంగా చర్చించారు. “బడిమానేసిన ప్రతి చిన్నారి మళ్లీ బడిబాట పట్టాలి” అని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో బడిమానేసిన పిల్లలు, ఇప్పటివరకు ఏ పాఠశాలలోనూ నమోదు కాని విద్యార్థులు, బడి ఈడు గల బాలబాలికలను ప్రత్యేక సర్వేల ద్వారా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు, తండాలు, కాలనీల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమీప ప్రభుత్వ పాఠశాలల్లో వారిని చేర్పించి నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నమోదు వివరాలను విశ్లేషించి ఈసారి మరింత మెరుగైన నమోదు సాధించేలా ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధిక నమోదు అవకాశాలు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# ప్రజా ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ

**వేద న్యూస్ వరంగల్ :**



ప్రజల ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను పోలీస్ కమిషనర్ జాగ్రత్తగా విన్నారు. సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో తీసుకుని చట్ట ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరిస్తే పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా పనిచేయాలని అన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం ఆరు ఫిర్యాదులు స్వీకరించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలు, భార్యాభర్తల వివాదాలు, కేసుల పురోగతి, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రతి సమస్యను సంబంధిత విభాగాలకు పంపించి తగిన చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.కమిషనరేట్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కమిషనర్ ప్రజలను కోరారు.

# ఇంధన ధరలపై నిర్మలా సీతారామన్ స్పందన

**వేద న్యూస్ డెస్క్:**



దేశంలో పెరుగుతున్న ఇంధన ధరలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా లో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం పటిష్ఠంగానే ఉందని ఆమె స్పష్టం చేశారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 37వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు సమాధానం ఇచ్చారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించాలని డిమాండ్లు వస్తున్నాయని, కానీ అలాంటి నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి దాదాపు లక్ష కోట్ల రూపాయల ఆదాయం నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం ప్రత్యేకంగా ‘3-ఎఫ్’ అంశాలపై దృష్టి పెట్టిందని మంత్రి వెల్లడించారు. ఇంధనం, ఎరువులు, విదేశీ మారక నిల్వలు అనే మూడు కీలక రంగాలపై కేంద్రం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోందని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఎరువుల ధరలు భారీగా పెరిగాయని, బంగారం ధరల పెరుగుదల కూడా సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకుంటోందని, బయటి ఒత్తిళ్లను ఎదుర్కొనేలా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు ఎక్కువగా అంతర్జాతీయ పరిణామాల కారణంగానే ఉత్పన్నమవుతున్నాయని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని స్పష్టం చేశారు. దేశ ప్రజల్లో నమ్మకం, ధైర్యం పెంచాల్సిన సమయంలో కొందరు కేవలం ప్రతికూల ప్రచారానికే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని మంత్రి హితవు పలికారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను గుర్తించాలని, దేశ ఆర్థిక వ్యవస్థపై అనవసర భయాలు సృష్టించడం మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# ఐక్యూబ్‌కు పెరుగుతున్న ఆదరణ

**వేద న్యూస్ డెస్క్:**



దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా పెరుగుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో రోజువారీ ప్రయాణాలకు అనువుగా ఉండే ఎలక్ట్రిక్ స్కూటర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ క్రమంలో టీవీఎస్ సంస్థ తయారు చేసిన ‘ఐక్యూబ్’ ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతోంది. ఆకర్షణీయమైన డిజైన్, అధునాతన సాంకేతిక ఫీచర్లు, మంచి రేంజ్ కారణంగా వినియోగదారులను ఆకట్టుకుంటోంది. టీవీఎస్ సంస్థ ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్, ఐక్యూబ్ ఎస్‌టీ పేర్లతో మూడు రకాల మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో బేసిక్ మోడల్ తక్కువ ధరలో లభిస్తుండగా, ఎస్‌టీ మోడల్ అత్యాధునిక ఫీచర్లతో ప్రీమియం వాహనంగా నిలుస్తోంది. ఐక్యూబ్ స్కూటర్లలో 2.2 కిలోవాట్, 3.1 కిలోవాట్, 3.5 కిలోవాట్, 5.3 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలు ఉన్నాయి. 2.2 కిలోవాట్ బ్యాటరీ కలిగిన స్కూటర్ ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే సుమారు 94 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 3.1 కిలోవాట్ మోడల్ 123 కిలోమీటర్ల వరకు, 3.5 కిలోవాట్ మోడల్ 145 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. టాప్ మోడల్ అయిన ఐక్యూబ్ ఎస్‌టీ 5.3 కిలోవాట్ బ్యాటరీతో ఏకంగా 212 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని సంస్థ వెల్లడించింది. ఈ స్కూటర్లలో ఎల్ఈడీ లైటింగ్, ఎకో మోడ్, పవర్ మోడ్, రివర్స్ పార్కింగ్ సదుపాయం, బ్లూటూత్ కనెక్టివిటీ, మొబైల్ కాల్, సందేశాల అలర్ట్స్, నావిగేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఐక్యూబ్ ఎస్‌టీ మోడల్‌లో ప్రత్యేకంగా పెద్ద టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, వాయిస్ అసిస్టెంట్, టైర్ గాలి ఒత్తిడి సూచన వ్యవస్థ వంటి ఆధునిక సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ స్కూటర్ల ధరలు మోడల్‌ను బట్టి మారుతున్నాయి. ఎక్స్ షోరూమ్ ధర సుమారు రూ. 1.13 లక్షల నుంచి రూ. 1.72 లక్షల వరకు ఉండగా, ఆన్ రోడ్ ధర రూ. 1.24 లక్షల నుంచి రూ. 1.78 లక్షల వరకు ఉంది. ప్రభుత్వ సబ్సిడీ వర్తిస్తే ధర కొంత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# పీఎఫ్ ఖాతా లాక్ అయితే ఇలా

**వేద న్యూస్ డెస్క్:**




దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాలను వినియోగిస్తున్నారు. అయితే ఇటీవల సాంకేతిక కారణాలు, భద్రతా నిబంధనల కఠినతరం కారణంగా చాలామంది పీఎఫ్ ఖాతాలు తాత్కాలికంగా లాక్ అవుతున్నాయి. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే పీఎఫ్ ఖాతా శాశ్వతంగా మూసివేయబడదని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇంటి నుంచే తిరిగి యాక్టివేట్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పీఎఫ్ ఖాతాలోకి లాగిన్ కావడానికి ప్రయత్నించినప్పుడు అకౌంట్ బ్లాక్ లేదా లాక్ అయినట్లు సందేశం కనిపించవచ్చు. పాస్‌వర్డ్‌ను పలుమార్లు తప్పుగా నమోదు చేయడం, గడువు ముగిసిన ఓటీపీని మళ్లీ మళ్లీ ఉపయోగించడం, అనుమానాస్పద లాగిన్ ప్రయత్నాలు చేయడం వంటి కారణాలతో భద్రతా వ్యవస్థ అకౌంట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తుంది

# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

**వేద న్యూస్ డెస్క్:**




అంతర్జాతీయంగా ఇరాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయంగా ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు వరుసగా నాలుగోసారి ధరలను సవరించడంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. గత మే 15 నుంచి ప్రారంభమైన ఈ పెంపుల ప్రభావంతో కేవలం రెండు వారాల్లోనే ఇంధన ధరలు దాదాపు రూ. 7.50 వరకు పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటడం, మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం చమురు దిగుమతి వ్యయాన్ని భారీగా పెంచినట్లు చమురు సంస్థలు పేర్కొంటున్నాయి. తాజా ధరల ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12కి చేరుకోగా, డీజిల్ ధర రూ. 95.20గా నమోదైంది. ఆర్థిక రాజధాని ముంబైలో పెట్రోల్ ధర రూ. 113.51కి, డీజిల్ ధర రూ. 97.83కి పెరిగింది. కోల్‌కతా, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు పెరిగాయి. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం ఇప్పుడు నేరుగా సామాన్యుల జీవితాలపై పడుతోంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు మరింత ఎగబాకే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు, కూరగాయలు, గుడ్లు, బ్రెడ్ వంటి రోజువారీ అవసరాల ధరలు కూడా త్వరలో పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హార్ముజ్ జలసంధి పరిధిలో ఉద్రిక్తతలు కొనసాగితే రానున్న రోజుల్లో ఇంధన ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కీలక రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ధరల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

వేద న్యూస్

మంగళవారం మే 26 , 2026


## హర్మన్‌ప్రీత్‌కు పద్మశ్రీ.. రాష్ట్రపతి చేతుల మీదుగా ఘన సత్కారం



**వేద న్యూస్ డెస్క్:**

భారత మహిళల క్రికెట్‌కు కొత్త దిశను చూపించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు లభించింది. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హర్మన్‌ప్రీత్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని స్వీకరించింది. భారత మహిళల జట్టుకు తొలి వన్డే ప్రపంచకప్ అందించి చరిత్ర సృష్టించిన ఆమె సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రకటించింది. సాంప్రదాయ దుస్తుల్లో కార్యక్రమానికి హాజరైన హర్మన్‌ప్రీత్‌కు రాష్ట్రపతి స్వయంగా అవార్డును అందజేయగా సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. మహిళా క్రికెట్ అభివృద్ధికి ఆమె చేసిన కృషి దేశానికి గర్వకారణమని రాష్ట్రపతి ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా భారత మహిళల క్రికెట్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో హర్మన్‌ప్రీత్ కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా నిరుడు స్వదేశంలో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టును విజేతగా నిలిపి 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారత్ 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించగా.. ఆ విజయంతో భారత మహిళల జట్టు తొలిసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ ఘనతతో హర్మన్‌ప్రీత్ పేరు భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఇంతకుముందు డయానా ఎడుల్జి, శాంత రామస్వామి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్ వంటి దిగ్గజాలకు కూడా సాధ్యం కాని విజయాన్ని హర్మన్‌ప్రీత్ సాధించడంతో ఆమెపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురిసింది. కేవలం కెప్టెన్‌గా మాత్రమే కాకుండా.. ఒత్తిడి సమయాల్లో జట్టును ముందుండి నడిపించే నాయకురాలిగా హర్మన్‌ప్రీత్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బ్యాటింగ్‌లో దూకుడు, మైదానంలో ఆత్మవిశ్వాసం, యువ ఆటగాళ్లకు ప్రేరణగా నిలవడం వంటి అంశాలు ఆమెను భారత మహిళల క్రికెట్‌కు ప్రతీకగా నిలబెట్టాయి. చిన్న పట్టణం నుంచి వచ్చి ప్రపంచస్థాయిలో భారత జెండాను ఎగురవేసిన ఆమె ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా మారింది. ఇక ఈసారి పద్మ పురస్కారాలు అందుకున్న క్రీడాకారుల్లో టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మ భూషణ్ లభించగా.. హాకీ కోచ్ బల్దేవ్ సింగ్, రెజ్లర్ భగవాన్‌దాస్ రైక్వర్, పారా హైజంపర్ ప్రవీణ్ కుమార్, తమిళ మార్షల్ ఆర్ట్స్ కళాకారుడు కె. పజనివెల్, భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తదితరులకు పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించారు. అయితే రోహిత్ శర్మ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. హర్మన్‌ప్రీత్‌కు పద్మశ్రీ లభించడం మహిళా క్రికెట్‌కు మరింత గౌరవాన్ని తీసుకొచ్చిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మహిళా క్రీడాకారిణులు కూడా ప్రపంచస్థాయిలో దేశానికి కీర్తి తీసుకురాగలరని ఆమె మరోసారి నిరూపించిందని అభిమానులు ప్రశంసిస్తున్నారు.

## మైదానంలోనే కుప్పకూలిన మాజీ రంజీ క్రికెటర్..



**వేద న్యూస్ డెస్క్:**

క్రికెట్‌నే జీవితంగా భావించిన ఓ మాజీ క్రికెటర్ మైదానంలోనే ప్రాణాలు కోల్పోవడం క్రీడా ప్రపంచాన్ని విషాదంలో ముంచేసింది. కర్ణాటక మాజీ రంజీ ఆటగాడు ఎస్.ఎల్. అక్షయ్(39) స్థానిక డివిజన్ క్రికెట్ మ్యాచ్ ఆడుతుండగా గుండెపోటుతో కన్నుమూశాడు. బెంగళూరులో ఆదివారం జరిగిన మహారాజా ట్రోఫీ కేఎస్‌సీఏ టీ20 టోర్నీలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పేస్ బౌలర్‌గా గుర్తింపు పొందిన అక్షయ్ మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా ఛాతిలో తీవ్రమైన నొప్పితో మైదానంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే సహచర ఆటగాళ్లు అతడిని సమీప ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొద్దిసేపటి ముందు వరకూ సహచరులతో సరదాగా గడిపిన అక్షయ్ ఇకలేడనే వార్త జట్టును తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విషాద వార్తను భారత మాజీ క్రికెటర్ దొడ్డ గణేశ్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. “అండర్-19 రోజుల నుంచి చూస్తున్న ప్రతిభావంతుడైన పేస్ బౌలర్ ఎస్.ఎల్. అక్షయ్ మ్యాచ్ ఆడుతుండగా గుండెపోటుతో మరణించడం ఎంతో బాధాకరం” అని ఆయన పేర్కొన్నారు. అక్షయ్ మరణంపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కర్ణాటకకు ప్రాతినిధ్యం వహించిన అక్షయ్ ఆటపట్ల అపారమైన అంకితభావంతో పనిచేశాడని కొనియాడింది. ఆటగాడిగా మాత్రమే కాకుండా కోచ్‌గా కూడా యువ క్రికెటర్లను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాడని సంఘం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా యువతలో క్రికెట్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో అక్షయ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కేఎస్‌సీఏ పేర్కొంది. ఆయన అకాల మరణం కర్ణాటక క్రికెట్‌కు తీరని లోటని క్రీడా ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఫ్రెంచ్ ఓపెన్‌లో భారత సంతతి యువ సంచలనం అదరహో

**వేద న్యూస్ డెస్క్:**



ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత సంతతికి చెందిన యువ ఆటగాడు నిశేష్ బసవరెడ్డి సంచలన విజయంతో ప్రపంచ దృష్టిని ఆకర్షిం చాడు. వైల్డ్ కార్డ్ ద్వారా ప్రధాన డ్రాలో చోటు దక్కించుకున్న ఈ 21 ఏళ్ల యువకుడు.. తొలి రౌండ్‌లోనే ఏడో సీడ్, అగ్రశ్రేణి అమెరికన్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించి భారీ సంచలనం సృష్టించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 148వ స్థానంలో ఉన్న నిశేష్.. అనుభవజ్ఞుడైన ఫ్రిట్జ్‌ను మట్టికోర్టులో మట్టికరిపిస్తూ రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. భారత మూలాలు కలిగిన అమెరికన్ ఆటగాడైన నిశేష్ బసవరెడ్డి.. చదువులోనూ, క్రీడల్లోనూ తన ప్రతిభను నిరూపిస్తున్నాడు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో డేటా సైన్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతున్న ఈ యువకుడు.. టెన్నిస్‌లోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌లో టెన్నిస్ దిగ్గజం నోవాక్ జకోవిచ్‌కు గట్టి పోటీ ఇచ్చి అందరి దృష్టిని ఆకర్షించిన నిశేష్.. ఇప్పుడు ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో అరుదైన విజయంతో వార్తల్లో నిలిచాడు. తొలి సెట్‌లో గట్టి పోరాటం చేసిన నిశేష్.. టైబ్రేక్‌లో 6-7 తేడాతో సెట్ కోల్పోయాడు. అయితే అక్కడే వెనక్కి తగ్గకుండా మరింత దూకుడుగా ఆడిన అతడు రెండో సెట్‌ను 7-5తో గెలుచుకొని మ్యాచ్‌లోకి తిరిగి వచ్చాడు. అనంతరం మూడో సెట్‌లో పూర్తిగా ఆధిపత్యం చెలాయిస్తూ టేలర్ ఫ్రిట్జ్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా వరుస పాయింట్లు సాధించాడు.

## ఐపీఎల్ ప్లే ఆఫ్స్ సమరం.. టైటిల్ కోసం నాలుగు జట్ల పోటీ

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ 19వ సీజన్ లీగ్ దశ ముగియడంతో ఇప్పుడు ప్లే ఆఫ్స్ పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఒక్కోసారి టైటిల్ గెలిచిన నాలుగు జట్లు మరోసారి ట్రోఫీని అందుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాయి. క్వాలిఫయర్-1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ తలపడనుండగా.. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా రాణించిన ఈ నాలుగు జట్లు ఇప్పుడు నాకౌట్ ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాయనేది ఆసక్తికరంగా మారింది.

**బెంగళూరుకు కోహ్లీ, భువనేశ్వర్ ప్రధాన బలం**

తొలి టైటిల్ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈసారి అద్భుత ప్రదర్శనతో టాప్‌లో నిలిచింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 557 పరుగులతో మరోసారి జట్టుకు అండగా నిలిచాడు. దేవదత్ పడిక్కల్, రజత్ పటిదార్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ మధ్య వరుసను బలపరిచారు. బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్ పవర్‌ప్లేలో ప్రత్యర్థులను కట్టడి చేస్తూ 24 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. హేజిల్‌వుడ్, రసిక్ దార్ సలాం కూడా కీలక సమయంలో వికెట్లు తీస్తూ జట్టుకు బలం చేకూరుస్తున్నారు.

**గుజరాత్‌కు గిల్, సాయి సుదర్శన్ ధైర్యం**

గుజరాత్ టైటాన్స్ మరోసారి టైటిల్‌పై కన్నేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 616 పరుగులతో జట్టును ముందుండి నడిపిస్తుండగా, సాయి సుదర్శన్ 638 పరుగులతో ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకెళ్తున్నాడు. బట్లర్, వాషింగ్టన్ సుందర్ మిడిల్ ఆర్డర్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. బౌలింగ్‌లో కగిసో రబడ, మహ్మద్ సిరాజ్ కొత్త బంతితో ప్రత్యర్థులను ఇబ్బంది పెడుతున్నారు. స్పిన్ విభాగంలో రషీద్ ఖాన్ మళ్లీ ఫామ్ అందుకోవడం జట్టుకు భారీ ఊరటనిస్తోంది.

**హైదరాబాద్‌కు క్లాసెన్, ఇషాన్ అండ**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సమతూకం చూపిస్తోంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ విఫలమైనా.. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ మిడిల్ ఓవర్లలో దూకుడుగా ఆడుతూ జట్టును గట్టెక్కిస్తున్నారు. క్లాసెన్ ఇప్పటికే 606 పరుగులతో టోర్నీలో టాప్ స్కోరర్లలో కొనసాగుతున్నాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్, యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్ అద్భుత ప్రదర్శనతో హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

**రాజస్థాన్ ఆశలు వైభవ్‌పైనే**

రాజస్థాన్ రాయల్స్ ఈసారి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైన భారీ ఆశలు పెట్టుకుంది. 583 పరుగులతో పాటు 53 సిక్సర్లు బాదిన వైభవ్ ఈ సీజన్‌లో ప్రత్యర్థి బౌలర్లకు భయంగా మారాడు. యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్, ఫెరీరా కూడా కీలక సమయంలో మెరుస్తున్నారు. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టుకు కీలకంగా మారాడు. బ్రిజేశ్ శర్మ, యశ్ రాజ్ కూడా నిలకడగా రాణిస్తున్నారు. మంగళవారం క్వాలిఫయర్-1, బుధవారం ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం క్వాలిఫయర్-2 గెలిచిన జట్లు మే 31న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో తలపడనున్నాయి. ప్రస్తుతం నాలుగు జట్లూ సమతూకంగా కనిపిస్తుండటంతో ఈసారి టైటిల్ పోరు మరింత ఉత్కంఠభరితంగా ఉండనుంది.

## ముంబై వైఫల్యంపై పొలార్డ్ కీలక వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టు ఈ సీజన్‌లో ఘోర ప్రదర్శనతో అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన ముంబై.. 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలకే పరిమితమై పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. దీంతో జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా నాయకత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 సీజన్ నుంచి జట్టు సారథ్య బాధ్యతలు చేపట్టిన హార్దిక్ పాండ్యా.. వరుసగా రెండోసారి జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో విఫలమయ్యాడు. ఈ నేపథ్యంలో అతడి కెప్టెన్సీ భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ.. జట్టు కోచ్ కీరన్ పొలార్డ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రాజస్థాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అనంతరం మాట్లాడిన పొలార్డ్.. హార్దిక్ కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదని అంగీకరించాడు. జట్టు యాజమాన్యం అతడికి అన్ని అవకాశాలు ఇచ్చిందని, కానీ ఆశించిన ఫలితాలు రాలేదని పేర్కొన్నాడు. అయితే ఈ పరాజయాలకు హార్దిక్ ఒక్కడినే బాధ్యుడిగా చూడలేమని కూడా స్పష్టం చేశాడు. జట్టంతా కలసికట్టుగా ప్రయత్నించినప్పటికీ ఫలితాలు అనుకూలంగా రాలేదని తెలిపాడు. “గెలుపోటములు ఆటలో సహజం. ఎవరినీ వేలెత్తి చూపే పరిస్థితి లేదు. హార్దిక్ తనవంతు ప్రయత్నం చేశాడు. కానీ జట్టుకు కలిసి రాలేదు” అని పొలార్డ్ వ్యాఖ్యానించాడు. జట్టులో మార్పులపై వస్తున్న వార్తల గురించి ప్రశ్నించగా.. భావోద్వేగాలకు లోనై నిర్ణయాలు తీసుకునే సమయం కాదని, యాజమాన్యం అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాడు. ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా వ్యక్తిగత ప్రదర్శన కూడా నిరాశపరిచింది. వెన్నునొప్పి కారణంగా నాలుగు మ్యాచ్‌లకు దూరమైన అతడు.. 10 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 206 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లోనూ ఆశించిన స్థాయిలో రాణించక నాలుగు వికెట్లకే పరిమితమయ్యాడు. ఇక జట్టులో కీలక ఆటగాళ్లైన సూర్యకుమార్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా కూడా తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోవడం ముంబై వైఫల్యానికి ప్రధాన కారణంగా మారింది. ఈ పరిస్థితుల్లో వచ్చే సీజన్‌కు ముందు ముంబై జట్టులో పెద్ద మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

## మెస్సి జట్టుకు అద్భుత విజయం..

**వేద న్యూస్ డెస్క్:**



రాబోయే ఫిఫా ప్రపంచకప్-2026 విరామానికి ముందు ఇంటర్ మైయామి జట్టు మేజర్ లీగ్ సాకర్‌లో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఫిలడెల్ఫియా యూనియన్‌తో జరిగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో ఇంటర్ మైయామి 6-4 గోల్స్ తేడాతో సంచలన కంబ్యాక్ విజయాన్ని అందుకుంది. స్టార్ ఫార్వర్డ్ లూయిస్ సువారెజ్ హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగగా.. బెర్టెరామ్ రెండు గోల్స్, రోడ్రిగో డి పాల్ ఒక గోల్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో మైయామి వరుసగా నాలుగో గెలుపును ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ ప్రారంభంలోనే ఫిలడెల్ఫియా యూనియన్ దూకుడుగా ఆడింది. నాలుగో నిమిషం, పదో నిమిషంలో వరుస గోల్స్ చేసి 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే 13వ నిమిషంలో లయనల్ మెస్సి ఇచ్చిన అద్భుత పాస్‌ను బెర్టెరామ్ గోల్‌గా మలిచి మైయామికి తొలి గోల్ అందించాడు. అనంతరం 20వ నిమిషంలో ఫిలడెల్ఫియా మరోసారి గోల్ చేసి స్కోరును 3-1కు చేర్చింది. ఈ దశలో ఇంటర్ మైయామి ఆటను పూర్తిగా మార్చేసింది. 29వ నిమిషంలో ఇయాన్ ఫ్రే ఇచ్చిన పాస్‌ను లూయిస్ సువారెజ్ అద్భుతమైన వాలీ షాట్‌తో గోల్‌గా మలిచాడు. 42వ నిమిషంలో మరోసారి మెస్సి అందించిన పాస్‌ను బెర్టెరామ్ కచ్చితంగా నెట్‌లోకి పంపి స్కోరును 3-3తో సమం చేశాడు. తొలి సగం ముగియడానికి ముందు 44వ నిమిషంలో సువారెజ్ తన రెండో గోల్ సాధించి మైయామిని ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. అయితే ఇంజ్యూరీ టైమ్‌లో ఫిలడెల్ఫియా మరో గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి స్కోరు 4-4తో సమంగా నిలిచింది. రెండో సగంలో ఇరు జట్లు గట్టిగా పోరాడినా.. చివరికి 81వ నిమిషంలో బెర్టెరామ్ ఇచ్చిన అసిస్ట్‌ను సువారెజ్ గోల్‌గా మలిచి తన హ్యాట్రిక్ పూర్తి చేశాడు. దీంతో మైయామి 5-4 ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ ముగిసే దశలో అదనపు సమయంలో సిల్వెట్టి ఇచ్చిన పాస్‌ను రోడ్రిగో డి పాల్ అద్భుతంగా గోల్‌గా మలిచి మైయామికి 6-4 విజయాన్ని ఖాయం చేశాడు. లయనల్ మెస్సి రెండు కీలక అసిస్టులతో జట్టు విజయానికి బలంగా నిలవగా.. లూయిస్ సువారెజ్ హ్యాట్రిక్ మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ గెలుపుతో ఇంటర్ మైయామి జట్టు లీగ్‌లో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.

వేద న్యూస్

మంగళవారం మే 26 , 2026

# సర్జరీలపై అవికా గోర్ క్లారిటీ



**వేద న్యూస్ డెస్క్:**

సినీ పరిశ్రమలో అందం, ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉండటంతో హీరోయిన్లపై తరచూ ప్లాస్టిక్ సర్జరీల ప్రచారం జరుగుతూనే ఉంటుంది. తాజాగా యంగ్ హీరోయిన్ అవికా గోర్‌పై కూడా ఇలాంటి రూమర్లు రావడంతో ఆమె వాటిపై ఘాటుగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అవికా గోర్ తన లుక్ గురించి వస్తున్న గాసిప్స్‌పై స్పందించింది. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ తర్వాత తన అందాన్ని మెయింటైన్ చేయడానికి ప్రత్యేక కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు తీసుకున్నారనే వార్తలపై ప్రశ్నించగా.. "నేను ఒక ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట నిజమే. కానీ అది అందం కోసం కాదు. ముఖంపై వచ్చిన పింపుల్స్ తగ్గించుకోవడానికి మాత్రమే ట్రీట్‌మెంట్ తీసుకున్నాను. అది కూడా పెద్దగా పనిచేయలేదు" అని చెప్పింది. నటిగా కనిపించే తీరు కోసం అవసరాన్ని బట్టి పార్లర్‌కు వెళ్లేదానినని, కానీ ఎలాంటి పెద్ద సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది. "నేను ఏడేళ్ల వయసులోనే మేకప్ వేసుకోవడం ప్రారంభించాను. అందుకే చర్మాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ సన్‌స్క్రీన్ వాడేదానిని. మా అమ్మకు ఇలాంటి విషయాలంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. చిన్న టాటూ వేసుకున్నా, హెయిర్ కట్ చేసినా కూడా టెన్షన్ పడిపోయేది. అలాంటప్పుడు నేను పెద్ద కాస్మోటిక్ సర్జరీలు ఎలా చేయించుకుంటాను?" అంటూ ప్రశ్నించింది. తన శరీరంలో వచ్చిన మార్పులకు కారణం బరువు తగ్గడం, పెరగడమేనని అవికా తెలిపింది. "చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చి, వాళ్ల కళ్ల ముందే హీరోయిన్‌గా ఎదిగాను. నాకు చాలా త్వరగా బరువు పెరుగుతుంది, అలాగే తగ్గుతుంది కూడా. షూటింగ్ లేకపోతే తినడమే పని చేసేదానిని. వయసు పెరిగేకొద్దీ ప్రతి ఒక్కరిలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ నేను చిన్నప్పటి నుంచి అందరికీ తెలిసిన వ్యక్తిని కావడంతో, చిన్న మార్పు కనిపించినా సర్జరీలు చేశానని అనుకుంటున్నారు" అని చెప్పింది. అలాగే స్టార్ హీరోయిన్లు సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డేలను చూసి తాను కూడా ఫిట్‌గా మారాలని ప్రేరణ పొందానని అవికా తెలిపింది. ప్రస్తుతం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి బరువు తగ్గేందుకు కష్టపడుతున్నానని వెల్లడించింది.

# థియేటర్ వివాదంలో రంగంలోకి చిరంజీవి



**వేద న్యూస్ డెస్క్:**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అమలుపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రమవడంతో పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు త్వరలో చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీపై ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉండగా, సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్స్‌డ్ రెంటల్ విధానమే కొనసాగుతోంది. ఇదే అంశంపై ఎగ్జిబిటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ వేదికల ప్రభావం, విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల నిర్వహణ భారంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే రకమైన అద్దె చెల్లించాల్సి రావడం వల్ల తీవ్ర నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న రెవెన్యూ షేరింగ్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతుండటంతో ఈ వివాదం మరింత వేడెక్కింది. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా నుంచే పర్సంటేజ్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.అదే సమయంలో టికెట్ ధరల పెంపుపై కూడా ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే థియేటర్లకు ప్రేక్షకుల సంఖ్య తగ్గుతోందని, అదనపు ధరలు విధిస్తే సాధారణ ప్రేక్షకులు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమలో సమస్యలు వచ్చినప్పుడు ముందుండి స్పందించే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో, ఈ వివాదానికి ఆయన మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# 'టెంపర్'పై బండ్ల గణేష్ ఆసక్తికర వ్యాఖ్యలు




**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సినీ ప్రయాణంలో కెరీర్‌ను పూర్తిగా మలుపుతిప్పిన చిత్రాల్లో 'టెంపర్'కు ప్రత్యేక స్థానం ఉంది. దర్శకుడు పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎమోషనల్ డ్రామా 2015లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా.. ఎన్టీఆర్‌లోని నటుడిని కొత్త కోణంలో ప్రేక్షకులకు పరిచయం చేసింది. అవినీతిపరుడైన పోలీస్ అధికారి నుంచి న్యాయం కోసం ప్రాణాలకైనా తెగించే వ్యక్తిగా మారే 'దయా' పాత్రలో తారక్ నటనకు అప్పట్లో విమర్శకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. తాజాగా ఈ సినిమాపై నిర్మాత బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నటుడు రాజా రవీంద్ర నిర్వహించిన పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న బండ్ల గణేష్.. 'టెంపర్' సినిమాకు సంబంధించిన అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఇప్పుడున్న మార్కెట్ పరిస్థితుల్లో 'టెంపర్' విడుదలై ఉంటే కచ్చితంగా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించేది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత జూనియర్ ఎన్టీఆర్‌కు దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ గుర్తింపు వచ్చిందని.. అలాంటి సమయంలో అదే స్థాయి కంటెంట్‌తో 'టెంపర్'లాంటి సినిమా వస్తే రికార్డులు తిరగరాసేదని ఆయన అభిప్రాయపడ్డారు. బండ్ల గణేష్ మాట్లాడుతూ.. 'బాద్‌షా' తర్వాత వచ్చిన 'రామయ్య వస్తావయ్యా', 'రభస' సినిమాలు అభిమానులు ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదని గుర్తుచేశారు. అలాంటి సమయంలో రచయిత వక్కంతం వంశీ చెప్పిన కథ తనకు చాలా బాగా నచ్చిందని తెలిపారు. ఆ కథలో ఉన్న ఎమోషన్, కమర్షియల్ ఎలిమెంట్స్ చూసి వెంటనే పూరీ జగన్నాథ్ వద్దకు తీసుకెళ్లినట్లు చెప్పారు. కథ విన్న వెంటనే పూరీ జగన్నాథ్ "ఇది నీకు మరో 'గబ్బర్ సింగ్' అవుతుంది" అని చెప్పినట్లు వెల్లడించారు. ఆ తర్వాత అదే కథ 'టెంపర్'గా రూపుదిద్దుకుని ఎన్టీఆర్ కెరీర్‌లో మైలురాయి చిత్రంగా నిలిచిందన్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ నటన గురించి ప్రత్యేకంగా మాట్లాడిన బండ్ల గణేష్.. "దయా పాత్రలో తారక్ చూపించిన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, ఎమోషనల్ ఇంటెన్సిటీ సినిమాకు ప్రాణం పోశాయి" అని పేర్కొన్నారు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో కోర్టు సన్నివేశంలో ఎన్టీఆర్ ప్రదర్శించిన భావోద్వేగ నటన ఇప్పటికీ ప్రేక్షకులను కదిలిస్తోందన్నారు. పడుతున్నారు. అప్పటివరకు మాస్ హీరోగా కనిపించిన తారక్.. ఈ సినిమాతో నటుడిగా మరింత బలమైన గుర్తింపును సంపాదించుకున్నాడు. పోలీస్ పాత్రలో ఆయన చూపించిన తీవ్రత, భావోద్వేగాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పూరీ జగన్నాథ్ రాసిన పవర్‌ఫుల్ డైలాగులు, అనూప్ రూబెన్స్ సంగీతం, క్లైమాక్స్ ట్విస్ట్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. అయితే బండ్ల గణేష్ చేసిన "వెయ్యి కోట్ల సినిమా" వ్యాఖ్యపై సినీ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అభిమానులు మాత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత తారక్ మార్కెట్ భారీగా పెరిగిందని.. ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో 'టెంపర్' విడుదలైతే నిజంగానే భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉండేదని అంటున్నారు. మరోవైపు కొందరు విశ్లేషకులు మాత్రం వెయ్యి కోట్ల మార్క్ అనేది చాలా పెద్దది అని, కానీ సినిమా మాత్రం ఖచ్చితంగా భారీ బ్లాక్‌బస్టర్ అయ్యేదని అభిప్రాయపడుతున్నారు.

# సమంత సినిమాకు విజయ్ షాక్..?




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. మొదట ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేయాలని భావించినప్పటికీ, ఐపీఎల్ ప్రభావం కారణంగా విడుదల వాయిదా పడింది. అనంతరం జూన్ 19న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది', జూన్ 26న రానున్న 'లెనిన్' మధ్య గ్యాప్‌ను ఉపయోగించుకుని సోలో రిలీజ్ ప్రయోజనం పొందాలని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఈ ప్రణాళికకు ఊహించని అడ్డంకి ఎదురైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకుడు' కూడా అదే తేదీన విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం విజయ్ రాజకీయాల్లోకి పూర్తిగా అడుగుపెట్టే ముందు నటించిన చివరి సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వేదికల్లో జూన్ 19 విడుదల తేదీ కనిపించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. విజయ్‌కు తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ అభిమాన వర్గం ఉండటంతో 'జన నాయకుడు'కి పెద్ద ఎత్తున ఓపెనింగ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎక్కువగా విజయ్ సినిమాకే ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఇది 'మా ఇంటి బంగారం' థియేటర్ కేటాయింపులు, కలెక్షన్లపై ప్రభావం చూపవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి కంటెంట్ ఉన్నప్పటికీ స్క్రీన్ కౌంట్ తగ్గితే ఓపెనింగ్స్‌పై ప్రభావం పడటం సహజమేనని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి సమంత నిర్ణయంపైనే నిలిచింది. విజయ్ లాంటి భారీ స్టార్ సినిమాతో పోటీకి సిద్ధమవుతుందా? లేక వ్యాపారపరమైన లెక్కలు చూసుకుని మరోసారి విడుదల తేదీని మార్చుకుంటుందా? అనే అంశం ఆసక్తికరంగా మారింది.

# 'దృశ్యం 3'కు వంద కోట్ల జోష్

**వేద న్యూస్ డెస్క్:**




ఇండియన్ సినిమా చరిత్రలో అత్యంత విజయవంతమైన క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో ఒకటైన దృశ్యం 3 బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కలయికలో వచ్చిన ఈ చిత్రం విడుదలైన కొద్ది రోజుల్లోనే వంద కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదలైన ఈ సినిమా కేవలం 58 గంటల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా మోహన్‌లాల్ సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. "గత 13 ఏళ్లుగా ఈ ప్రయాణంలో మాతో ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అంటూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం తొలి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.117.17 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది. మాలీవుడ్ చరిత్రలోనే అత్యంత వేగంగా భారీ వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్‌లో కూడా 'దృశ్యం 3' దూకుడు కొనసాగుతోంది. ప్రముఖ టికెటింగ్ వేదికలో మూడో రోజు 3.62 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. వీకెండ్ కావడంతో ఆదివారం కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి రెండు భాగాలతో పోలిస్తే ఈసారి కథలో సస్పెన్స్ కంటే భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రేక్షకులు చెబుతున్నారు. జార్జ్‌కుట్టి పాత్రలో మోహన్‌లాల్ మరోసారి తన అద్భుత నటనతో ఆకట్టుకున్నారు. కుటుంబాన్ని కాపాడుకునేందుకు ఆయన చేసే పోరాటం, గత సంఘటనల ప్రభావం, పోలీసుల ఒత్తిడి నేపథ్యంలో సాగే కథ ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తోంది.

# 'కర' ఓటీటీలోకి రానున్న వేళ




**వేద న్యూస్ డెస్క్:**

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'కర' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందన అందుకున్న ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటన చేసింది. ఈ చిత్రాన్ని మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు వెల్లడించింది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా సినిమాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని నెట్‌ఫ్లిక్స్ నిర్ణయించింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే స్థానిక దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో విభిన్నమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ధనుష్ ప్రయత్నించారు. సినిమా విడుదల సమయంలో కథపై మిశ్రమ అభిప్రాయాలు వచ్చినప్పటికీ, ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మాత్రం మంచి ప్రశంసలు అందుకున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఓటీటీ విడుదలపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి వద్ద నుంచే ఈ సినిమాను వీక్షించేందుకు సిద్ధమవుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073